

# అనైతికం

వీడి

మంచికంటి

**ఎంత చూసినా తనివితీరని అందం ఆమెది.**

**ఆమె నవ్వుతుంటే వెన్నముద్దలు రాలి వొళ్ళో పడుతున్నట్టుగా ఉంటుంది. ఆ చూపుల్నుండి సూర్యకిరణాలొచ్చి నేరుగా గుండెల్లోకి దూసుకుపోతున్నట్టుగా ఉంటుంది. ఆ మాటల్లో చంద్రోదయం. ఆమె పాటల్లో చుక్కల ఆకాశం కళ్ళముందు ప్రత్యక్షమౌతుంది.**

ఎంతకాలం ఆమె కోసం ఎదురుచూసింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆ సమయం ఇప్పుడు కళ్ళముందు నిల్చింది. అప్పటికప్పుడే మనసులో ఆరాటం చిన చిన్న కంపనంతో మొదలై అలజడిగా మారి, ఆనంద తరంగ డోలికల్లో ఊగుతూ తూగుతూ, పిల్లగాలి సవ్వడి చేతులు పట్టుకుని నాజూగ్గా తడుముతూ తడుముతూ ఆనంద పారవశ్య సాగరంలో మునగడానికి సంసిద్ధుడౌతూ ఆమెవంకే ఆమె వక్షం వంకే ఆ మోము వంకే ఋషిలా మహర్షిలా తదేక దీక్షతో చూస్తూ చూస్తూ ఉత్కంఠను భరించలేక తనువు సారించిన బాణంలా ఆమెవైపు ఎక్కుపెట్టి ఉన్నాడు.

ఆమె చేతులు నెమ్మదిగా కదులుతూంటే తెల్లన్ని వెన్నెల కాంతి పిండారబోసినట్లుగా... సమ్మోహనమైన తరంగ వీచికలు కంటిపాపల్లో ఇంకిపోతున్నట్టు శిశిరము నుండి హేమంతానికి వలసపోతున్నట్టు తన్మయత్వానికి లోనౌతూ పులకించిపోయే సమయాన ఎక్కడో ఏదో చిన్న అలికిడి... లోలోపలి మెదడు పొరల్లో సూదుల సంగీతం. ఆమె వక్షం వైపు చూసేకొద్దీ చూపుల్లో తత్తరపాటు...

ఎక్కడిదో సంశయం సంవేదనేదో, సంకుచితత్వమేదో చిరుజల్లులా మొదలై సన్నని వొణుకై మెదడు లోలోపలి పొరల్లో కలకలంలా... పెనుకంపంలా....

మనసునిండా నిండిన ఆమె ప్రేమ రూపంలో మునిగి తేలుతూ తన్మయమై తమకంతో... దూరం తగ్గించాలని... ఒకరిలో ఒకరం రహస్యాలు శోధించాలని పవిత్ర సంగమస్థలానికి చేరాలని... తెలియని ఆరాటాలకు తెర దించాలని నెమ్మది నెమ్మదిగా ప్రయాణించే సమయాన ఈ హఠాత్సంఘటన. అనూహ్య పరిణామం. అవాంఛనీయమైన ఆలోచనగా ఒక్కసారి షాక్... అంతే ఆ దృశ్యం నుండి నిష్క్రమించాలని వెనక్కు... వెనక్కు... ఇంకా వెనక్కు...

ఏమైందో తెలియని భావనతో కళ్ళు మూసుకుని వెనక్కు అడుగేస్తుంటే ఆమె కళ్ళల్లో అసహనం. ఆమె గుండెల్నిండా అవమానం.

ఏమిటీ వింత ప్రవర్తన.... ప్రేమ... అభిమానం... ఆప్యాయత అనుభూతిగా మారే లోపలే నాకెందుకింత అవమానం...

ఆమె ప్రేమపూరిత చూపుల నుండి అగ్నిజ్వాలలు రాలిపడుతున్నాయి. విషపుజల్లులు వర్షిస్తున్నాయి.

అయినా ఏంచెయ్యడం. ఆలోచనా తరంగాలు ఎక్కడికో లాక్కుపోతున్నాయి. పోతూ పోతూ ఉంటే... ఎక్కడికైందీ ఏమిటైందీ అర్థం కావడం లేదు. అనంత దూరం ప్రయాణం చేసీ చేసీ అక్కడ ఆగిపోయిన తరంగాలు ఒక్కటొక్కటే ఎగసిపడుతూ, చీకటి విడిపోయినట్లుగా... మంచు తెరలు చీల్చుకుంటున్నట్టుగా స్పష్టా స్పష్టమైన రూపం... రంగు వెలసిపోయినట్టున్న ఆ తేజం... మబ్బులున చంద్రుడిలా దివ్య సుందరమైన రూపం కన్నులముందు నిలబడింది.

చీకట్లో చేతుల్తో వెదుక్కుంటున్న గుడ్డివాడిలా వెతుకుతుంటే చేతులు రెండూ సాచి మాతృ హృదయంతో ఆహ్వానిస్తుంది.

ఎవరామె...? ఎవరా ప్రేమమూర్తి.... ఎవరూ ఇంకెవరు. అమ్మ కదూ! అమ్మే... అవును అమ్మే... అమ్మా రెండు చేతుల్తో తల పట్టుకుని అక్కడే కుప్పలా కూలి... అమ్మా... అమ్మా...

కళ్ళు మూసుకుపోయేకొద్దీ పొరలు పొరలుగా దృశ్యాలు విడిపోయి ముందుకొచ్చి నిలబడుతున్నాయి.

ఆమె ముఖంలో అనిర్వచనీయమైన ఆనందమేదో తాండవిస్తుంది. ఆ... ఆనందం తీరాలకు చేరుతున్నట్టుగా... ఆమనిలో కోకిలగానం విన్నంత పరవశంగా ఆమె అర్ధనిమీలిత నేత్రాలతో తన వొడిలోనున్న బిడ్డ శిరస్సుపై చేయి ఉంచి... చిరుజల్లు నేలను తడిమినట్లుగా...

కథ

శీతల వాయు సమీరం మేనిని సోకినట్టుగా... జట్టును నెమ్మదిగా తడుముతూ అర్ధనిమీలిత నేత్రాలతో బిడ్డకు పాలు తాపుతుంది.

ఒకవైపు అధర దరహాసం. మరోవైపు అమృతాన్ని సేవిస్తున్నంత ఆనందంతో ఆ బిడ్డ పాలు తాగుతూనే మరోవైపు పాలిండ్లతో ఆడుకుంటూ ఆమె ముఖంలోకి చూడాలని ప్రయత్నంచేస్తూ ఉన్నాడు.

ఎవరా బిడ్డ? ...ఆ దృశ్యం పదే పదే తన కన్నుల ముందు ఎందుకు దృశ్యమానమౌతుంది? అవును ఎవరోకాదు నేనేకదూ... అవును నేనే... నేనే...

నవీన్ ఏమైంది నీకు? లుంగలు చుట్టుకుపోతున్నావేమిటి? ఎందుకలా కళ్ళు మూసుకున్నావు? నా స్థన సౌందర్యం అంత వికారంగా

**సుహాసిని నన్ను ఎంతగానో అర్థం చేసుకుందనిపించింది. తీరా పంట చేతికొచ్చే సమయానికి వర్షం పడ్డట్టుగా... ఆమే అసహ్యించు కుంటూ వెళ్ళిపోతే...**

**ఇప్పుడింకెవరు నా పరిస్థితిని అర్థం చేసుకునేది. ఆ దృశ్యమే పదే పదే కళ్ళ ముందుకు వొచ్చి నిలబడుతుంది. వర్ణనాతీతమైన ఈ అవస్థని ఎలా భరించను కళ్ళు మూసినా తెరిసినా ఆ దృశ్యమే మళ్ళీ మళ్ళీ వెంటాడుతుంది.**

ఉందా నీకు? నీవు చూడడానికి కూడా అంత వికారంగా ఉన్నానా నేను! గుచ్చి గుచ్చి అడుగుతున్న సుహాసినికి ఏమని సమాధానం చెప్పాలి.

హాసినీ ఏం చెప్పాలి నీకు...! ఏమని చెబితే నీ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. ఎలా విడమర్చి చెబితే నన్నర్థం చేసుకుంటావు నువ్వు... తల పగిలిపోతుంది. కణతలు నొక్కుకుంటూ ఆమెతో అంటుంటే...

ఆమె కళ్ళల్లో ప్రేమ కాస్తా అసహ్యంగా మారుతూ... ద్వేషించే కన్నులతో నువ్వేమీ చెప్పొద్దులే... నేనే వెళ్ళిపోతున్నాను అక్కడి నుండి... ఆ గదిలో నుండి... నా మదిలో నుండి. విసురుగా బయటికి వెళ్ళిపోయింది.

పోయిన ఆమె వంకే చూస్తుంటే... అయ్యో పాపం అని జాలి పడడం తప్ప ఏం చెయ్యాలి. పోవడం ఆమె తప్పేంకాదే! ఈ స్థితిలో ఎవరైనా అలానే ప్రవర్తిస్తారేమో...

సుహాసిని నన్ను ఎంతగానో అర్థం చేసుకుందనిపించింది. తీరా పంట చేతికొచ్చే సమయానికి వర్షం పడ్డట్టుగా... ఆమే అసహ్యించుకుంటూ వెళ్ళిపోతే...

ఇప్పుడింకెవరు నా పరిస్థితిని అర్థం చేసుకునేది. ఆ దృశ్యమే పదే పదే కళ్ళ ముందుకు వొచ్చి నిలబడుతుంది. వర్ణనాతీతమైన ఈ అవస్థని ఎలా భరించను కళ్ళు మూసినా తెరిసినా ఆ దృశ్యమే మళ్ళీ మళ్ళీ వెంటాడుతుంది.

అందరి పిల్లల్లాగా పెంచిందా అమ్మ తనని. అలా పెంచి ఉంటే నాకీ అవస్థ తప్పేది కదా! ఎంత ప్రేమ అమ్మకి తనమీద. ఏ చిన్న విషయానికీ నన్ను బాధ పడనిచ్చేదికాదు. నా సంతోషం కోసం ఏమైనా చేసేది.

ఎవరైనా నన్ను ఒక్కమాట అన్నారని తెలిస్తే వాళ్ళ ఇంటికి వెళ్ళి మరీ దెబ్బలాడివొచ్చేది. నాకు కావాల్సింది ఏదైనా తల తాకట్టు పెట్టయినా సరే తెచ్చి తనకు ఇచ్చేది. ఏ పిల్లల చేతిలో కొత్త వొస్తువు ఏది కనబడినా మారాం చేసేవాడిని. నా చేతిలో అది తెచ్చిపెట్టిందాకా ఆమె ప్రాణం గిలగిలలాడిపోయేది.

అంత గారాబంగా పెరగడంతో నేను బాగా పెంకిగా తయారయ్యాను. ఒరే అందరూ ఎప్పుడో పాలు మరిచిపోయారురా. నువ్వేందిరా ఐదేళ్ళు దాటి తాటిచెట్టంత ఎదిగావు. ఇంకా పాలు తాగడానికి సిగ్గెయ్యడము లేదురా! చూడు ఆ పిల్లలు ఎంత బాగా ఆడుకుంటున్నారో పోయి వాళ్ళతో ఆడుకోకూడదు అంటూ కోపంతో విసుక్కునేది.

ఊహూ... నేను పోనని కాళ్ళు చేతులూ నేలకేసి తపతపా కొడుతుంటే చూస్తూ ఉండలేక అమ్మ మనసు కరిగిపోయేది. రారా నాయనా అంటూ కోప్పడుతూనే రవిక ముడి విప్పేది.

ఆడుకుంటున్న పిల్లల్ని చూస్తూనే పాలు తాగేవాడిని. అందరితో పాటు ఆడుకోవాలని మనసులో పీకుతున్నా, దానికంటే అమ్మ దగ్గర పాలు తాగడమే ఆనందకరమైన విషయంగా తోచేది.

పాలు మానిపించడానికి ఒక్కోసారి నా కళ్ళముందే కలబంద తెచ్చి పూసేది. అయినా చేత్తో తుడుచుకుని తాగేవాడిని. సొంటి రాసేది. ఒక్కోసారి మట్టిపాటి లక్ష్మి చెప్పిన చిట్కాలు ప్రయోగించేది.

అయినా పట్టినపట్టు వదలకుండా ఆరో సంవత్సరం వొచ్చిందాకా పాలు తాగుతూనే ఉన్నాను. ఆ తరువాత ఎప్పటికో నాకై నేను మానేశానే గానీ అమ్మ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

ఇప్పుడా దృశ్యాలే నన్ను పిచ్చివాణ్ణి చేస్తున్నాయి. ఎంత ప్రయత్నించినా ఒక్కొక్కటే కళ్ళముందుకొచ్చి ప్రత్యక్షమౌతున్నాయి. ఏ స్త్రీ వంక చూసినా అమ్మ దగ్గర పాలు తాగే దృశ్యమే కంటిముందు మెదులుతుంది.

ఆరోజు గదిలో నుండి హాసిని కోపంగా వెళ్ళిపోయినప్పటి నుండీ అమ్మవంక కన్నెత్తి చూడాలంటే విపరీతమైన భయమెయ్యసాగింది. అమ్మ ఎదురొస్తే మెల్లగా పక్కకు తప్పుకు తిరగసాగాను. ఆమె మొఖం వంక చూస్తూ కళ్ళల్లో కళ్ళు బెట్టి సూటిగా మాట్లాడలేకపోతున్నాను.

ఇంటికి రావాలంటేనే భయం వెయ్యసాగింది. ఒక్కసారిగా నాలో వొచ్చిన మార్పు అమ్మకు కూడా అర్థమైంది.

ఏమిరా? ఏమైంది నీకు? ఎందుకలా ఉంటున్నావు? ఒంట్లో బాగోలేదా? అంటూ చాలాసార్లు గుచ్చి గుచ్చి ప్రశ్నించింది.

ఏమని చెప్పాలి అమ్మకు. ఇంట్లోనైనా బయటైనా ఏ సమస్య వొచ్చినా అమ్మకే చెప్పుకునేవాడిని. నా దగ్గరగా కూర్చొని తలలోకి వేళ్ళు పోనిస్తూ చిత్రంగా కదుపుతూ ఎంతటి సమస్యకైనా చిటికెలో పరిష్కారం చెప్పేది.

అలాంటిది ఇవాళ అమ్మకే చెప్పుకోలేని సమస్య నా కళ్ళముందు నాట్యం చేస్తుంది. ఇప్పుడు ఎవరికి చెప్పాలి. ఎవరికైనా చెబితే నన్నర్థం చేసుకుంటారా! అసహ్యించుకుంటారా!

ఆరోజు అమూల్యమైన ఆ క్షణాల్లో నిస్సహాయుడినైన నన్ను చూసిన హాసిన ఎంత అసహ్యంతో వెళ్ళిపోయింది. ఈ సమస్యని ఆరోజు చెప్పలేకపోయాను. ఇప్పుడైనా చెబితే... తను కూడా అసహ్యించుకుంటుందేమో! ఇంకెవరికి చెప్పాలి. ఎ...వరి...కెవ...రికి... అబ్బా తల

